## క్లుప్తంగా

### నేడు ఆత్మీయ సమ్మేళనం

**ఆమనగల్లు:** ఆమనగల్లు మున్సిపాలిటీ పరిధిలోని విద్యానగర్ కాలనీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో కాలనీవాసుల ఆత్మీయ సమ్మేళన కార్యక్రమం నేడు (ఆదివారం) నిర్వహిస్తున్నట్లు సంఘం అధ్యక్షుడు పాషా ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సమావేశానికి విద్యానగర్ కాలనీవాసులు హాజరు కావాలని ఆయన కోరారు.

### నర్సరీ ఏర్పాటుకు స్థల పరిశీలన



స్థలాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీఓ

**మాడ్గుల:** మండలంలోని అవురుపల్లి గ్రామ పంచాయతీలో శనివారం ఎంపీడీఓ రాఘువులు పర్యటించారు. గ్రామంలోని నర్సరీ ఏర్పాటుకు స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నిర్దేశించిన లక్ష్యం ప్రకారం మొక్కలను పెంచాలని సూచించారు. మొక్కల పెంపకంలో నిర్లక్ష్యం వహిస్తే నిర్వాహకులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

### ముక్కోటి దర్శనానికి భక్తులు క్యూ



బారులుదీరిన భక్తులు

**హయత్‌నగర్:** ముక్కోటి ఏకాదశిని పురస్కరించుకుని శనివారం వైష్ణవ దేవాలయాలకు భక్తులు క్యూ కట్టారు, తుర్కయాంజాల్ మున్సిపాలిటీలోని తొర్రూర్‌లోని శ్రీ గోదా సమేత స్వయం భూ రంగనాథస్వామి ఆలయంలో కొలువైన రంగనాథ స్వామిని దర్శించుకునేందుకు భక్తులు ఉదయం నుంచే పెద్ద ఎత్తున తరలివచ్చారు.

### మల్లు రవికి సత్కారం



మల్లుకి పుష్పగుచ్ఛం అందజేస్తున్న నేతలు

**ఆమనగల్లు:** పీసీసీ ఉపాధ్యక్షుడు, మాజీ ఎంపీ మల్లురవిని శనివారం ఆమనగల్లుకు చెందిన పలువురు కాంగ్రెస్ నాయకులు సత్కరించారు. హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ డైరెక్టర్ జంగయ్య, జిల్లా కాంగ్రెస్ నాయకులు రవీందర్‌నాయక్, శ్రీనివాసులు మల్లురవిని మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో సత్కరించారు.

### పంటసాగుపై అవగాహన



పొలంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు

**ఇబ్రహీంపట్నం రూరల్:** దేశానికి అన్నం పెట్టే అన్నదాత చేసే పనులపై విద్యార్థులు అవగాహన కల్గి ఉండాలని పోల్కంపల్లి ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు నర్సింహారావు పేర్కొన్నారు. శనివారం మండలంలోని పోల్కంపల్లి గ్రామంలో రైతు దినోత్సవాన్ని విద్యార్థులు, ఉపాధ్యాయులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు క్షేత్ర పర్యటనకు వెళ్లారు. పంటలు సాగు చేసే విధానంపై విద్యార్థులకు ఉపాధ్యాయులు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు కృష్ణ, ఎల్.కిరణ్‌కుమార్, విద్యార్థులు పాల్గొన్నారు.

### 'మహాలక్ష్మి' పథకాన్ని సవరించాలి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

**ఇబ్రహీంపట్నం రూరల్:** కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన మహాలక్ష్మి పథకాన్ని సవరించాలని ధర్మసమాజ్ పార్టీ ఇబ్రహీంపట్నం మండల కమిటీ డిమాండ్ చేసింది. శనివారం తహసీల్దార్ అన్వర్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆ పార్టీ నాయకులు మాట్లాడుతూ.. ఆర్టీసీ బస్సుల్లో తెల్లరేషన్ కార్డు కల్గిన వారికే అవకాశం కల్పించాలన్నారు. ఇంటిని పోషించే పురుషులకు ఉచిత ప్రయాణం కల్పించాలన్నారు. ఆటో కార్మికులకు నెలకు రూ.3వేలు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో రవీందర్, భవాని శేఖర్, రాజు, సురేందర్, బాబురావు, శ్రీకాంత్, చక్రపాణి, నాగార్జున తదితరులు పాల్గొన్నారు.



ఆమనగల్లులో శ్రీ వేంకటేశ్వరస్వామి దేవాలయంలో స్వామివారిని దర్శించుకుంటున్న భక్తులు



కడ్తాల్: ఉత్తర ద్వారం నుంచి స్వామివారిని దర్శించుకుంటున్న భక్తులు



యాచారం: ప్రత్యేక అలంకరణలో స్వామివారు

# భక్తి పారవశ్యం

- ఆలయాలు కిటకిట
- ఉత్తర ద్వార దర్శనం చేసుకున్న భక్తులు

వైకుంఠ ఏకాదశిని పురస్కరించుకొని శనివారం ఆయా ప్రాంతాల్లోని వేంకటేశ్వర స్వామి ఆలయాలను నిర్వాహకులు శోభాయమానంగా అలంకరించారు. ఉదయం నుంచే భక్తులు దేవాలయాలకు బారులుదీరి ప్రత్యేక పూజలు చేశారు. గోవిందా నామస్మరణతో ఆలయాలు మార్మోగాయి. అనంతరం పూజరులు భక్తులకు ఉత్తర ద్వారం నుంచి స్వామివారి దర్శనం కల్పించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా నిర్వాహకులు అన్ని సౌకర్యాలు కల్పించారు. –సాక్షి, వెబ్‌సైట్



ఆమనగల్లు: ప్రత్యేక అలంకరణలో శ్రీవారు



ఆమనగల్లు: పూజలు చేస్తున్న మాజీ జెడ్పీటీసీ శ్రీనివాస్‌రెడ్డి



కొత్తపల్లిలో వేంకటేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు చేస్తున్న భక్తులు



తుర్కయంజాల్ : బాలాజీ వేంకటేశ్వర స్వామి దేవాలయం వద్ద భక్తుల రద్దీ



తలకొండపల్లి: పారాయణ పఠనం చేస్తున్న భక్తులు, పూజారులు

### నేడు రామదూత ఆశ్రమం ప్రారంభం

**ఆమనగల్లు:** ఆమనగల్లు పట్టణంలోని శ్రీ నిత్య శుద్ధానందస్వామి క్షేత్రంలో నిర్మించిన శ్రీ రామదూత ఆశ్రమాన్ని నేడు(ఆదివారం) ప్రారంభిస్తున్నట్లు ఆశ్రమ సంస్థాపకులు శ్రీ శివానందస్వామి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. శ్రీ రామదూత ఆశ్రమాన్ని యజ్ఞ పల్క్య ఆశ్రమం పీఠాధిపతి శ్రీ వర విద్యానందగిరి మాతాజీ ప్రారంభిస్తారని తెలిపారు. ఆశ్రమ ప్రారంభోత్సవానికి భక్తులు అధిక సంఖ్యలో హాజరు కావాలని కోరారు.

### ఆచారిని కలిసిన కాలనీవాసులు



ఆచారికి ఆహ్వాన పత్రిక అందజేస్తున్న కాలనీవాసులు

**ఆమనగల్లు:** ఆమనగల్లు పట్టణంలో శనివారం జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యుడు ఆచారిని స్థానిక విద్యానగర్ కాలనీ సంక్షేమ సంఘం సభ్యులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా విద్యానగర్ కాలనీలో నేడు(ఆదివారం) నిర్వహించే కాలనీవాసుల ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమానికి హాజరు కావాలని ఆహ్వాన పత్రికను అందజేశారు. కార్యక్రమంలో విద్యానగర్ కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు పాషా, కోశాధికారి సుదర్శన్‌రెడ్డి, సంయుక్త కార్యదర్శి వెంకటేశ్వర్‌రెడ్డి, సభ్యులు పర్వతాలు, ఆరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

## తండాలను పంచాయతీలు చేయండి

**రాష్ట్ర పంచాయతీ రాజ్ శాఖ మంత్రి సీతక్కను కలిసిన కుర్మిద్ద గ్రామస్తులు**

**యాచారం:** గత కేసీఆర్ సర్కార్ ఫార్మాసిటీని తెచ్చి గిరిజన తండాలను తీసేయడానికి కుట్రలు చేసిందని, ప్రత్యేక గ్రామ పంచాయతీలు చేసే అవకాశం ఉన్నప్పటికీ చేయలేదని కుర్మిద్ద అనుబంధ గిరిజన తండాలు మంగలిగడ్డ, మర్లకుంట గిరిజనులు వాపోయారు. శనివారం కుర్మిద్ద గ్రామ సర్పంచ్ బందె రాజశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో రాష్ట్ర పంచాయతీ రాజ్ శాఖ మంత్రి సీతక్కను కలిశారు. ఫార్మాసిటీ రద్దు కోసం మీరు కూడా మా తండాల్లో పాదయాత్ర చేశారని గుర్తు చేశారు. మంగలిగడ్డ, మర్లకుంట తండాల్లో 500లకు పైగానే ఓటర్లు ఉన్నారని తెలిపారు. తండాలను ప్రత్యేక గ్రామ పంచాయతీలుగా



సీతక్కకు వినతి పత్రం అందజేస్తున్న సర్పంచ్ రాజశేఖర్‌రెడ్డి, తండావాసులు

చేయాలని విజ్ఞప్తి చేశారు. మంత్రి కలిసిన వారిలో ఫార్మాసిటీ వ్యతిరేక పోరాట సమితి కన్వీనర్ శ్రీకాంత్ నాయక్, రైతులు రాంచంద్రారెడ్డి, రమేశ్, గణేశ్, పాపిరెడ్డి, సత్యనారాయణ తదితరులు ఉన్నారు.

## లోక్ అదాలత్‌లో సత్వర న్యాయం

- ఇబ్రహీంపట్నం ప్రిన్సిపాల్ సివిల్ సీనియర్ జడ్జి శ్రీదేవి
- లోక్ అదాలత్‌లో 1897 కేసులు రాజీ

**ఇబ్రహీంపట్నం రూరల్:** దీర్ఘకాలంగా కోర్టుల చుట్టూ తిరిగే కక్షిదారులకు లోక్‌అదాలత్‌తో సత్వర న్యాయం జరుగుతుందని ఇబ్రహీంపట్నం ప్రిన్సిపాల్ సివిల్ సీనియర్ జడ్జి శ్రీదేవి పేర్కొన్నారు. ఇబ్రహీంపట్నంలోని బాలాజీ ఫంక్షన్ హాల్‌లో జాతీయ మెగా లోక్ అదాలత్ నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా జడ్జి శ్రీదేవి, ప్రిన్సిపాల్ సివిల్ జూనియర్ జడ్జి జస్వంత్ సింగ్, మహేశ్వరం జోన్ డీసీపీ చింతమనేని శ్రీనివాస్‌లు హాజరయ్యారు. ఈ సందర్భంగా శ్రీదేవి మాట్లాడుతూ..



లోక్‌అదాలత్‌లో మాట్లాడుతున్న జడ్జి శ్రీదేవి, డీసీపీ శ్రీనివాస్

రాజీ మార్గమే రాజమార్గమన్నారు. నిరంతరం కోర్టులు పోలీస్ స్టేషన్ల చుట్టూ తిరగకుండా కక్షిదారుల్లో మార్పురావాలని తెలిపారు. సమస్యలను సృష్టించుకొని చిక్కుల్లో పడొద్దని చెప్పారు. కోర్టులను, చట్టాలను గౌరవించి వాటి పరిధిలో ఉండాలని, ప్రజాస్వామ్యానికి హాని చేయకూడదని వివరించారు. భారత రాజ్యాంగంపై అవగాహన కల్గి ఉండాలని సూచించారు. డీసీపీ చింతమనేని శ్రీనివాస్ మాట్లాడుతూ.. గొడవలు పడి పోలీస్ స్టేషన్లకు రావొద్దని సూచించారు. శాంతి భద్రతల కోసం పోలీసులు, కోర్టులు ఉన్నాయన్నారు. లోక్ అదాలత్‌లో 1897 కేసులు పరిష్కారమయ్యాయి. ఆదిబట్ల పోలీస్ స్టేషన్‌పరిధిలో 171, మంచాల పోలీస్‌స్టేషన్ పరిధిలో 657, యాచారం పీఎస్ పరిధిలో 220, ఇబ్రహీంపట్నం పీఎస్ పరిధిలో 800, గ్రీన్‌ఫార్మా పరిధిలో 49 పిట్టి కేసులు పరిష్కరించామని వెల్లడించారు. మరో 39 ఐపీసీ కేసులు కూడా పరిష్కరించామని తెలిపారు. కార్యక్రమంలో ఇబ్రహీంపట్నం ఏసీపీ కె ఎస్ రావు, ఇబ్రహీంపట్నం డివిజన్ సీఐలు, ఎస్ఐలు, అధికారులు పాల్గొన్నారు.

## భూములపై రుణాలు ఇవ్వండి



డీసీసీబీ చైర్మన్‌కు వినతి పత్రం అందజేస్తున్న నేతలు

**తుర్కయంజాల్:** ప్రభుత్వం హక్కు పత్రాలు అందజేసిన భూములపై స్వల్పకాలిక, దీర్ఘకాలిక రుణాలు ఇప్పించాలని కోరుతూ బీజేపీ రాష్ట్ర క్రమశిక్షణ కమిటీ సభ్యులు ప్రతాప్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు లచ్చిరెడ్డి, జిల్లా ఎస్సీ మోర్చా అధ్యక్షుడు రమేష్‌లు శనివారం డీసీసీబీ చైర్మన్ సత్తయ్యను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కేంద్ర సహకార బ్యాంకు ద్వారా ప్రభుత్వం హక్కులు కల్పించిన భూములపై గడిచిన 13 సంవత్సరాలుగా ఎలాంటి రుణాలు ఇవ్వడం లేదని ఆరోపించారు. గతంలో ప్రభుత్వాలు నిరుపేద కుటుంబాలకు, ఆ భూములపై హక్కు పత్రాలు ఇచ్చారు. కావునా, వాటిని పరిశీలనలోకి తీసుకుని రుణాలు మంజూరు చేయాలని కోరారు. రుణాలు ఇవ్వకపోవడం రైతులు అప్పులు చేయాల్సి వస్తుందని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు శ్రావణ్ కుమార్‌గౌడ్, నర్సింహాగౌడ్, శ్రీకాంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### లక్ష్య సాధనకు కృషి చేయాలి

**ఆయిస్టర్ స్వచ్ఛంద సంస్థ రాష్ట్ర అధ్యక్షుడు సునీల్ సింగడే**



విద్యార్థులతో ఆయిస్టర్ సంస్థ ప్రతినిధులు, సీజీఆర్ సంస్థ సభ్యులు

**కడ్తాల్:** విద్యార్థులు లక్ష్య సాధనకు కృషి చేయాలని, ఆయిస్టర్ స్వచ్ఛంద సంస్థ రాష్ట్ర అధ్యక్షుడు సునీల్ సింగడే సూచించారు. శనివారం మండల కేంద్రంలోని బాలికల ఉన్నత పాఠశాలలో, కౌన్సిల్‌ఫర్ గ్రీన్ రెవల్యూషన్- ఆయిస్టర్ స్వచ్ఛంద సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో విద్యార్థులకు కెరీర్ గైడెన్స్ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన సునీల్ సింగడే విద్యార్థులకు పలు సూచనలు, సలహాలు చేశారు. విద్యార్థులకు 10వ తరగతి ఉన్నత స్థాయిలో ఉంచడానికి నిర్దేశించే మొదటి మెట్టని అన్నారు. కష్టంగా కాకుండా ఇష్టంగా చదవాలని సూచించారు. అనంతరం పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా విద్యార్థులకు కెరీర్ గైడెన్స్ సలహాలు, సూచనలు అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం అరుణ, ఆయిస్టర్ సంస్థ కార్యానిర్వహణ అధికారిణి కాసర్ల రజిత, గాడిపల్లి కిరణ్, బాలచైతన్య కేంద్రాల నిర్వాహకులు రజనీకాంత్, విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

### ఘనంగా మహా పడిపూజ



శబరిమలకు బయలుదేరుతున్న స్వాములు

**మాడ్గుల:** మండలం పరిధిలోని కొల్కులపల్లి గ్రామంలోని రామలింగేశ్వరస్వామి దేవాలయ ఆవరణలో శనివారం అయ్యప్ప మహా పడిపూజను వైభవంగా నిర్వహించారు. గణపతి హోమం నిర్వహించిన అనంతరం గురుస్వాముల ఆధ్వర్యంలో మహా పడిపూజ చేశారు. ఈ సందర్భంగా శబరిమలకు వెళ్తున్న అయ్యప్ప స్వాములకు గురుస్వాములు ఇరుముడులు కట్టారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ అనురాధ, ఎంపీటీసీ సభ్యులు కిషన్‌రెడ్డి, గురుస్వాములు యాదయ్య, చంద్రయ్య, యాదయ్య, స్థానిక నాయకులు ధనయ్యగౌడ్ ధనయ్య పాల్గొన్నారు.

## శ్రీవారి బ్రహ్మోత్సవాలు ప్రారంభం

**తలకొండపల్లి:** మండలంలోని రాంపూర్ వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. శనివారం ఆలయంలో అంకురారోహణం, అభిషేకం, కర్పూర హారతి నీరాజనం, వేద పారాయణం, సంకీర్తనలు, భజనలు, తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించారు. సర్పంచ్ శ్యాంసుందర్‌రెడ్డి దంపతులు స్వామిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. కన్నుల పండువగా కొనసాగిన ఉత్సవాలకు భక్తులు తండోపతండాలుగా తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ నిర్వాహకులు భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా సకల సదుపాయాలు కల్పించారు. కార్యక్రమంలో ఈఓ స్నేహలత, సర్పంచ్ శ్యాంసుందర్‌రెడ్డి క్లర్క్ ఆంజనేయులు, కృష్ణారెడ్డి, శివ, నర్సింహ, యాదయ్య, ఆలయ సిబ్బంది, పూజారులు, భక్తులు, తదితరులు పాల్గొన్నారు.

## గాయత్రీ మహాయజ్ఞం ప్రారంభం

**అబ్దుల్లాపూర్‌మెట్:** విశ్వ శ్రేయస్సును కాంక్షిస్తూ అబ్దుల్లాపూర్‌మెట్ మండలం పిగ్లీపూర్ శివారులోని దేశ్‌ముఖిలో గల మౌంట్ శంబల ది గ్లోబల్ శక్తి కేంద్రంలో ప్రతి సంవత్సరం దత్త పౌర్ణమి రోజున నిర్వహించే శ్రీ రాజ గుసూయ గాయత్రీ మహాయజ్ఞం శనివారం ప్రారంభమైంది. గత తొమ్మిది సంవత్సరాలుగా నవమ 108 కుండియ శ్రీ రాజసూయ గాయత్రి మహాయజ్ఞం అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో భాగంగా కాశీ నుంచి విచ్చేసిన శ్రీ సత్యానంద స్వామి పర్యవేక్షణలో సామూహిక కలశ యాత్ర శంబాల గోశాల నుంచి ప్రారంభమై శంబల విశ్వగిరి చుట్టూ ప్రదక్షిణలు నిర్వహించారు. మూడు రోజుల పాటు నిర్వహించే ఈ పూజా కార్యక్రమాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని నిర్వాహకులు కోరారు.



సామూహిక కలశ యాత్రలో పాల్గొన్న భక్తులు

## సమాజంపై అవగాహన అవసరం



అగ్నిమాపక శాఖ కార్యాలయంలో విద్యార్థులు

**ఎస్ఐ కృష్ణయ్య**

**ఇబ్రహీంపట్నం రూరల్:** విద్యార్థులు సమాజంపై అవగాహన కల్గి ఉండాలని ఆదిబట్ల ఎస్ఐ కృష్ణయ్య, ప్రధానోపాధ్యాయులు వర్కాల పరమేష్ పేర్కొన్నారు. మున్సిపాలిటీ కేంద్రానికి చెందిన ప్రాథమిక పాఠశాల విద్యార్థులు నాల్గవ శనివారం నోబ్యాగ్ డే సందర్భంగా ఆదిబట్ల పోలీస్‌స్టేషన్, ఫైర్‌స్టేషన్‌ను పరిశీలించారు. అలాగే విద్యార్థులకు చట్టాలపై అవగాహన, విపత్కర సమయంలో ఎలా స్పందించాలో వివరించారు. అనంతరం ఎస్ఐ కృష్ణయ్య మాట్లాడుతూ.. చదువుకునే స్థాయి నుంచే సమాజానికి సేవ చేసేలా ఆలోచించాలని సూచించారు. అత్యవసర సమయంలో 100 ఫోన్ చేస్తే పోలీసులు , 101కి ఫోన్ చేస్తే అగ్నిమాపక శాఖ అధికారులు స్పందిస్తారని వివరించారు. నేరాల అదుపులో ప్రతి పౌరుని పాత్ర కీలకమన్నారు. విద్యార్థులు సమాజంలో ఉన్న అన్ని శాఖలు , భారత రాజ్యంగంపై అవగాహన కల్గి ఉండాలని తెలిపారు.

## నిరుపేదలను ఆదుకునేందుకే..



ఆర్థికసాయం అందజేస్తున్న దశరథ్‌నాయక్

**ట్రస్ట్ చైర్మన్ దశరథ్ నాయక్**

**కడ్తాల్:** నిరుపేదలను ఆదుకునేందుకే రాధాకృష్ణ చారిటబుల్ మెమోరియల్ ట్రస్ట్‌ను ఏర్పాటు చేశామని ట్రస్ట్ చైర్మన్, జెడ్పీటీసీ జర్పుల దశరథ్ నాయక్ అన్నారు. మండల పరిధిలోని మైసిగండి, ముద్విన్, ఎక్వాయిపల్లి, గోవిందాయిపల్లిలో ఇటీవల వివిధ కారణాలతో పలువురు మృతి చెందారు. శనివారం బాధిత కుటుంబ సభ్యులను దశరథ్‌నాయక్ పరామర్శించారు. ఈ సందర్భంగా వారి కుటుంబాలకు రూ.5 వేల చొప్పున రూ.45 వేలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండలంలోని నిరుపేదలకు ఏ ఆపద వచ్చినా ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆదుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో రైతుబంధు జిల్లా సభ్యుడు శ్రీనివాస్‌రెడ్డి, సింగిల్ విండో చైర్మన్ వెంకటేశ్‌గుప్తా, ఎంపీటీసీలు లచ్చిరామ్, ప్రియారమేశ్, సర్పంచ్‌లు తులసీరాం, యాదయ్య, సులోచనసాయిలు, ఉప సర్పంచ్ రామకృష్ణ ఉన్నారు.

## ఆర్థిక సహాయం

**తలకొండపల్లి:** మండల పరిధిలోని మాదాయిపల్లికి చెందిన భూషమోని రాములు (71) అనారోగ్యంతో శనివారం మృతిచెందాడు. విషయం తెలుసుకున్న బీఆర్ఎస్ సీనియర్ నేత శ్రీనివాస్‌యాదవ్, జెడ్పీటీసీ ఉప్పల వెంకటేశ్, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డిలు బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి సానుభూతి వ్యక్తం చేశారు. శ్రీనివాస్‌యాదవ్ రూ. 3000, జెడ్పీటీసీ రూ. 3000, ప్రభాకర్‌రెడ్డి రూ. 3000 ఆర్థిక సహాయం అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ హైమావతి రామస్వామి, ఉప సర్పంచ్ అజీజ్, లక్ష్మీనారాయణ, యాదయ్య, శేఖర్, భగవంతు, నిరంజన్, శ్రీశైలం, రవికుమార్, చంద్రమౌళి, రహమత్, గౌస్, ఆరీఫ్, ఎల్లయ్య, బాస్కర్, ప్రభాకర్, నెహ్రూ, చెన్నయ్య, తదితరులు పాల్గొన్నారు.

## వైద్య శిబిరాల ఏర్పాటు అభినందనీయం

**మాజీ ఎమ్మెల్యే తీగల కృష్ణారెడ్డి**

**మీర్‌పేట:** పేద, మధ్యతరగతి ప్రజలు నివసించే ప్రాంతాల్లో ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించడం అభినందనీయమని మాజీ ఎమ్మెల్యే తీగల కృష్ణారెడ్డి ప్రశంసించారు. మీర్‌పేట కార్పొరేషన్ 45వ డివిజన్‌లో నక్షత్ర ఆస్పత్రి సహకారంతో స్థానిక కార్పొరేటర్ అక్కి మాధవి ఆధ్వర్యంలో శనివారం ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరానికి కృష్ణారెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉచిత శిబిరాలను స్థానికులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి, మీర్‌పేట అధ్యక్షుడు సామిడి గోపాల్‌రెడ్డి, కీసర యాదిరెడ్డి, వైద్యులు త్రిష, తులసి, సీఈఓ శివచంద్రప్రకాశ్ పాల్గొన్నారు.